

బచ్చన్నపేటలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఎల్లంలలో ఓటు వేసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి దంపతులు



లింగాలఘనపురంలో బీఆర్ఎస్ శ్రేణులతో ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి



బచ్చన్నపేటలో ఓటు వేసిన
మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి



చిల్పూరు మండలం రాజవరంలో ఓటు హక్కు వినియోగించుకున్న
జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి కుటుంబ సభ్యులు



జనగామలో ఓటు వేసిన
కలెక్టర్ శివలింగయ్య దంపతులు



నీర్మాలలో ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలోని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు



దేవరుప్పులలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

# పాలకుర్తిలో గెలుపు నాదే

- **బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**
- **దేవరుప్పలలో పోలింగ్ సరళి పరిశీలన**

దేవరుప్పుల, నవంబర్ 30: పాలకుర్తిలో మళ్లీ తానే గెలవబోతున్నానని, కాకుంటే అనుకున్నంత మెజారిటీ రాదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని సర్పంచ్ రమాదేవి ఇంటి ఆవరణలో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, ఇంటింటికీ అందిన సంక్షేమ ఫలాలు తనకు భారీ మెజారిటీ ఇస్తాయని భావించినా, అందుకు తగ్గ మెజారిటీ రాదన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న కొందరు నాయకులు పార్టీ మారడంతో కొంత నష్టం జరిగిందని, ప్రజలు తన వెంట ఉండడంతోనే విజయం సాధిస్తున్నానని ఎర్రబెల్లి తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధితోపాటు తనను నమ్ముకున్న కార్యకర్తలకు సేవ చేసేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలకు ఓటర్లు కొందరు అటువైపు మొగ్గు చూపడంతో మెజారిటీ తగ్గుతుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. మళ్లీ అధికారంలోకి రాగానే మరిన్ని అభివృద్ధి చేపడుతామన్నారు.

# పోటెత్తిన ఓటరు చైతన్యం

- **జనగామ సెగ్మెంట్‌లో 83.34 శాతం**
- **స్టేషన్‌ఘన్‌పూర్‌లో 76.25 శాతం**
- **పాలకుర్తిలో 81.23 శాతం పోలింగ్**
- **2018 ఎన్నికలతో పోలిస్తే జనగామ, పాలకుర్తిలో తగ్గిన ఓటింగ్ శాతం**

జనగామ, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టానికి గురువారం తెరపడింది. జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజవర్గాల్లో జనం ఓటేసేందుకు పోటెత్తారు. ఈసారి యువత, మహిళలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఉదయం నుంచే బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సాగిన పోలింగ్ ప్రక్రియలో తొలి గంటలో పోలింగ్ మందకొడిగా ప్రారంభమై 9 గంటల నుంచి కేంద్రాల వద్ద జనం బారులుతీరి కనిపించారు. మునుపెన్నడూ లేనివిధంగా కొత్తగా ఓటు నమోదైన యువత, లబ్ధిదారులు, వృద్ధులు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలిరావడం ఓటరులో చైతన్యం కనిపించింది. వృద్ధులు, నడిచేందుకు సైతం యాతన పడే వృయోవృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో కేంద్రాలకు తరలించి వారితో నేరుగా ఓటు వేయించారు. అయితే చాలా పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్లు సరిగా పనిచేయలేదనే ఫిర్యాదులు వచ్చినా తాగునీరు, టెంట్లు వంటి ఇతర వసతుల కల్పన మెరుగ్గానే ఉన్నట్లు స్పష్టమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు జాతర వాతావారణం నెలకొన్నది. వివిధ ప్రాంతాలో ఉంటూ స్థానికంగా పట్టణ వార్డులు, గ్రామాల్లో ఓటు హక్కు ఉన్న వారంతా దుర్గమ్మ, బొడ్రాయి పండుగకు వచ్చినట్లు పెద్దఎత్తున తరలిరావడంతో అటు ఆర్టీసీ బస్సులు, బస్టాండ్, ఇటు రైల్వేస్టేషన్, రైళ్లు జనంతో కిటకిలాడాయి. ఓటు పండుగకు వచ్చిన జనం, వాహనాలతో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి, జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రాల్లోని టిఫిన్ సెంటర్లు, భోజన, ఛాయ్ హోటళ్లు రద్దీగా మారాయి. గతంతో పోలిస్తే ఈసారి పోల్ చిట్టిలు, ఓటరు జాబితాలో తమ పేర్లు గల్లంతు వంటి ఫిర్యాదులు ఓటర్ల నుంచి రాలేదు. అధికార యంత్రాంగం ఓటు చైతన్యం, పోల్‌చిట్టిలు వంటి అంశాలపై అవగాహన కల్పించడంతో ఓటుహక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం వచ్చింది. జనగామ నియోజకవర్గంలోని పలు కేంద్రాలను బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటింగ్ సరళిని పరిశీలించగా, పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి పోలింగ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.



జనగామ పట్టణం గణేశ్‌వాడ పోలింగ్ కేంద్రంలో ఓటేసిన
బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ

**ఓటేసిన బీఆర్ఎస్ అభ్యర్థులు..**

జిల్లాలోని పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్వతగిరిలో ఓటు హక్కు వినియోగించుకోగా, స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి హనుమకొండలో, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి జనగామ మండలం ఎల్లంలలో, డాక్టర్ రాజయ్య స్టేషన్‌ఘన్‌పూర్‌లో, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య రఘునాథపల్లి మండలం ఖిలాషాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ, పార్టీ పట్టణ ఇంఛార్జిగా వ్యవహరించిన భరత్‌కృష్ణ గణేశ్‌వాడ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**భారీగా నమోదైన పోలింగ్..**

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈసారి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోటీ జరిగింది. జనగామ సెగ్మెంట్‌లో 83.34 శాతం, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 76.25 శాతం, పాలకుర్తిలో 81.23 శాతం పోలింగ్ నమోదైంది. అయితే గత 2018 ఎన్నికలతో పోలిస్తే జనగామ, పాలకుర్తి సెగ్మెంట్‌లో పోలింగ్ శాతం తగ్గితే, స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాత్రం ఓటింగ్ పెరిగింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో 85.58 శాతం పోలింగ్ నమోదైతే ఈసారి మాత్రం పోలింగ్ 83.34శాతానికి, పాలకుర్తి సెగ్మెంట్‌లో 88.5 శాతం నుంచి 81.23శాతానికి పడిపోగా, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాత్రం 67.5శాతం నుంచి 76.25శాతానికి పెరిగింది. అయితే ఈసారి కొత్తగా 80 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, పీడబ్ల్యూడీ (దివ్యాంగులు), పోస్టల్, సర్వీస్ ఓటర్లు, ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయ, ఉద్యోగులు ముందుగానే ఓటు హక్కు వినియోగించుకోవడంతో ఓటింగ్ శాతంలో కొంత తేడా కనిపించింది. పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజు నమోదైన ఓటర్ల లెక్కలు వెల్లడైతే తప్ప అసలైన పోలింగ్ శాతం తెలుస్తుంది.